


బెటర్‌హాఫని ఇంగ్లీషులోనూ, అర్ధాంగి అని తెలుగులోనూ కట్టుకున్న భార్యకి పేర్లుపెట్టి అవమానించకూడదు. హాఫ్‌లూ, అర్ధలూ తీసేయాలి. ఇవన్నీ తప్పుడు లెక్కలు. పరమ పాత లెక్కలు. అసలీ లెక్కల్తో వచ్చిన చిక్కేయిది. అర్ధాంగి అంటే వినడానికి అందంగా వుంటుందని లెక్క కట్టేరేగాని నన్నడుగుతే మగవాడి శరీరమూ వాడి మనసూ విశాలమైన హృదయమూ అన్నీ కూడా పెళ్ళినాడు భార్యకి ట్రాన్స్‌ఫరై పోతాయి. తాళికి మూడు ముళ్ళు వేయమన్నారు. పిచ్చివాళ్ళయి ఆ మాట అనలేదు. ఒక్కో ముడికి ఒక్కోవంతు శక్తిని భార్యకి ధార పోస్తున్నాడని మనం అర్ధం చేసుకోవాలి. ఆ విధంగా ముప్పాతిక మనిషి మూడు ముళ్ళు కట్టి ఖర్చయిపోతున్నాడు. మిగిలింది ఆఫ్టరాల్ పాతిక భాగం. ఆ పాతిక భాగాన్ని

కొందరు మొండివాళ్ళు గట్టిగా పట్టుక్కూర్చుంటారు. చాలామంది మాత్రం రొటీన్లో ఆ పాతిక భాగం కూడా భార్యకే సమర్పించు కుంటారు. ఏతా వాతా మనిషి మొత్తం సమస్తమైన శక్తులతో భార్యకి దాసోహమంటాడే కాని సగమిచ్చి సగం దాచుకునే స్వార్థం మగవాడికి లేదని తెలుసుకోవాలి.

ఓడిపోతూ కూడా ఓడిపోయేమని చెప్పుకునే ధైర్యం లేక చూస్కో- మా తడాఖా అంటూ ఆడవాళ్ళకి అబలలనీ అదనీ ఇదనీ బిరుదు లిచ్చి మగ వాళ్ళు తృప్తి పడుతున్నారు. సిటీ బస్సుల్లోనూ, రైలు పెట్టెల్లోనూ ఆడ వాళ్ళకి ప్రత్యేకంగా సీట్లు కేటాయించి ఓహో ఆహో అనుకుంటున్నారు. ఇట్లాంటి రిజర్వేషన్లు ఎత్తిపారేయాలి. తన ఓటమిని అంగీకరించి మగవాడే తనకు రిజర్వేషన్లు ఏర్పాటు చేసుకోవాలి. బస్సులో మగవాడు నిల బడితే ఆడమనిషి లేచి 'విందుని సీటు యిచ్చే రోజు అతి త్వరలో రావాలి.

తెలివి తక్కువగా మగవాడు ఆడదానితో తగాదాపడి దెబ్బ తింటా డనే భయంతో అసలా ప్రయత్నమే చేయకుండా జాగ్రత్త పడేందుకు కొన్ని నీతి సూత్రాలు రాసేరు. "ఎక్కడ ఆడది గౌరవింపబడదో అక్కడ సుఖ శాంతు లుండవ"నే సూత్రం ఈ కోవకి చెందినదే. ఇదేదో శాపమనుకుని భయపడి మగవాడు చొరవ తీసుకోకుండానూ....పోన్లే పాపమని ఆడవాళ్ళు అనుకునేందుకూ ఈ సూత్రాలు బాగా పని చేస్తున్నాయి. అయితే యిక్కడో చిక్కుంది. ఆడదంటే భార్య ఒక్కర్తె. తల్లీ, చెల్లీ ఇత్యాదులు కూడా ఆడ జాతేనని భర్త చెప్పినా భార్య వినదు. భర్తనే మనిషి తన దగ్గరే అణిగి మణిగి వుండాలి. తననే అపారంగా గౌరవించాలి. తల్లికి, చెల్లికీ కూడా యస్ మేడమంటే అసలు మేడమ్‌కి కోపం వస్తుంది. దుఃఖం వస్తుంది. చిరాకు ఎక్కువవుతుంది. వంట చెయ్యదు. కోపం గది నుంచి కాలు బయట పెట్టదు. భర్త తనకి మాత్రమే పిల్లి. బయట జనానికి పులి. అట్లాగే బతకా లతను. "ఒరే నాయనా....నారక్తపోటుకి మాత్రలు తీసుకొచ్చేవుట్రా" అని తల్లి అడిగినప్పుడు నోరుముయ్ అని గాండ్రించాలే గానీ, లేదు తల్లీ క్షమించ మని కాళ్ళమీద పడకూడదు.

నిజమే మరి, మూడు ముళ్ళూవేసి ముప్పాతిక పవరు పోగొట్టుకున్న మనిషికి స్వతంత్ర నిర్ణయాలు రాకూడదు. ఏమి చేయాలన్నా, ఏమి చెప్పాలన్నా భార్యామణితో సంప్రదింపులు చాలా అవసరం. పెళ్ళికాక మునుపు ఆ వ్యక్తి పూర్ణ మానవుడే కావచ్చు. ఆ పిరియడ్‌లో అతను తల్లికీ, చెల్లెలికీ దాసోహమన్నా బాధలేదు. పెళ్ళి మూలంగా సర్వశక్తులూ పోగొట్టుకున్న మనిషతను. ఇప్పుడూ అదే వరసంటే ఎట్లా వీలవుతుంది. ఇక అతని తెలివితేటల విషయం అడగండి. పవర్తోపాటు తన తెలివి గూడా పెళ్ళి పీటల మీదే భార్యకి ధారపోసి వుంటాడు. భార్యామణికి ఒరిజినల్‌గా వున్నటువంటి తెలివి సంపదకు పెళ్ళి పీటల మీద భర్తనుంచి లాక్కున్న తెలివి జతచేరి తెలివి మీరిన వనితవుతుంది భార్య. అక్కడ్నుంచి మీరు త్త అమాయకులండీ పాపమని మూడోనాటినుంచే కుంపటి పెడుతుంది. తెలివి పోగొట్టుకున్న భర్త ఆమాట నిజమని తప్పకుండా అంగీకరిస్తాడు. ఎంతో ప్రయోజకురాలైన తన భార్య తన పక్కన లేకపోతే బతకలేనేమోనని భయపడతాడు. ఇల్లా, ఆఫీసనే తేడాల్లేకుండా అన్ని విషయాలూ అవిడ్తో సంప్రదిస్తుంటాడు. ఆవిడ సలహా లేకుండా మంచినీళ్ళు తాగడు. గాలిపీల్చడు. భర్త తాలూకా ఈ అవిటితనంతో ఆవిడేమో చక్రం తిప్పుతుంది.

సగటు భార్యలంతా యింత పవర్‌ఫుల్‌గా బతుకుతుంటే వాళ్ళని అర్ధాంగి.... బెటర్ హాఫ్‌లని అవమానిస్తుంటే కళ్ళు పోతాయని నేను మనవి చేస్తున్నాను. ఆ మాటకొస్తే మగవాడి గొప్పేమిటని సూటిగా అడుగుతున్నాను. సంపాదిస్తున్నాడనే క్వాలిఫికేషన్ తగిలిస్తే తగిలించండి. హూకేరిట్స్ చదువుకున్న భార్య కూడా ఆఫీసుల కెడుతుంది. సంపాయిస్తుంది. ఆ అవకాశంలేని భార్యలంటారా....వాళ్ళ విషయం కూడా మనవి చేస్తాను. ఆఫీసులో పనికంటే ఇంట్లో పని బోలెడంత బాధ్యతతో కూడుకున్నదని మనం తెలుసుకోవాలి. ఆఫీసులో నిద్రపోవచ్చు. లేటుగా వెళ్ళొచ్చు. అటునుంచి అటు మేట్నీల కెళ్ళొచ్చు. పని చేస్తున్నట్టు నటిస్తూ గప్పాలు కొట్టొచ్చు. ఆదివారాలూ, హాలీడేసూ వగైరా హంగులెన్నో వున్నాయి. క్యాజువల్ లీవులూ ఎర్నెడ్ లీవులూ అదనంగా వుండనే వుంటాయి. ఇంటి విషయం అట్లాకాదే. లేచిం దగ్గర్నుంచీ మళ్ళా నడుం వాల్చేంత వరకూ చచ్చినట్టు

చాకిరీ చేయాలి. సెలవలుండవు. సెలవరోజున అధికమైన పని. బడ్జెట్ ప్రకారం ఖర్చులు. పిల్లలా వాళ్ళ బాగోగులూ ఎందులోనూ నిర్లక్ష్యం తగదు. ఎందులోనూ బద్ధకించకూడదు. ఈ మహాయజ్ఞం ముందు ఆఫ్టరాల్ ఆఫీసెంత? ఆఫీసులో మగవాడి విలువెంత?

అంతెందుకు ఇన్నిన్ని గొప్పలు చెప్పుకునే మగవాడు భార్య జ్వరంతో మంచమెక్కితే అతని అవస్థ చూడండి. అతని ఇల్లే అతనికి నరకమవుతుంది. ఏ వస్తువెక్కడుందో తెలియదు. కాఫీ పెట్టుకు తాగుదామంటే ఒక పూట పని పడుతుంది. ఇంక వంటేం చేయగలడు. తాను వేళకి ఆఫీసుకేం వెళ్ళగలడు. మొన్నా మధ్యా మా ఆవిడ జ్వరంతో మంచ మెక్కితే టీ పొడి ఎక్కడ పెట్టేవని అడిగేను. ఆవిడ జవాబు టూకీగా యిట్లా వుంది. "పోపుల డబ్బా పక్కన పంచదార డబ్బా వుంటుంది. దాని మీద కాఫీ పొడరని కాగితం అంటించేను. అందులో వుంటుంది టీ పొడి.

ఆఫీసులో ఏ ఫైలు ఎక్కడుందో రిజిస్టరు చూస్తేనే తప్ప చెప్పలేడు మగవాడు. ఇంట్లోనున్నటు వంటి సమస్త వస్తువులూ ఏం మూసుగులో ఎక్కడున్నాయో ఏరిజిస్టరుసహాయం లేకుండానేతడుముకోకుండా చెబుతుందిఇల్లాలు. ఆఫీసులో అతను ఆఫీసరుకి దాసోహమనక పోయినా....ఇంటి వద్ద ఇల్లాలి రూల్సు చచ్చినట్టు పాటించాలి. జోళ్ళు విప్పిరండి. కాళ్ళు కడుక్కోండి. తడి గొడుగు యింట్లో పెట్టొద్దు. సాయంత్రం పెందరాళే రాకపోతే అన్నం పెట్టను. స్నానం చేయ్యందే కాఫీ ఇవ్వను. ఇత్యాది ఆర్డర్లకు తలవంచవలసిందేగానీ తిరగబడేందుకు వీల్లేదు. ఇప్పుడు చెప్పండి....బెటర్‌హాఫ్ ఇల్లాలవుతుందా? మగవాడా?